క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలసిన క్రిస్టియన్ నేతలు



తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన క్రిస్టియన్ మైనార్టీ సెల్ నేతలు

జగ్గంపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉభయగోదావరి జిల్లాల క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి జాన్ వెస్లీ, పలువురు పార్టీ నేతలు కలిశారు. శుక్రవారం తాడేపల్లిలో జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలను వివరించారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మాజీ సీఎం జగన్ వారికి సూచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జార్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

జగ్గంపేట: రామవరం సమీపంలో రంగవల్లి నగర్‌లో గురువారం అర్ధరాత్రి పూరిగుడిసె దగ్ధమైంది. గ్రామంలోని భద్రాసి శివకు చెందిన పూరి గుడిసెకు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుని కాలిపోయింది. ఈ ప్రమాదంలో కొంతమేర ఆస్తినష్టం జరిగింది.

మత్స్యకార సంఘ అధ్యక్షుడిగా శివ



నూతన కార్యవర్గ సభ్యులకు ఎన్నిక పత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి గ్రామ మత్స్యకార సంఘ అధ్యక్షుడిగా పదాల శివ ఎన్నికయ్యారు. మత్స్యకార సొసైటీ అధికారి కర్రి రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షుడిగా పత్తికొండ సత్యనారాయణ, కార్యదర్శిగా నక్కా కామరాజులను మత్స్యకారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను అంకంరెడ్డి బుల్లిబాబు, రుత్తల శ్రీనివాసు, అంకంరెడ్డి గోపి, మత్స్యకారులు సత్కరించి అభినందించారు.

రోడ్ల మరమ్మతులకు రూ.1.90 కోట్లు మంజూరు

తుని రూరల్: తుని నియోజకవర్గంలో 15 రోడ్ల మరమ్మతులకు రూ.1.90 కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే యనమల దివ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం ప్రభుత్వం మంజూరు చేసిన ఈ నిధులతో తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో ఇప్పటికే పనులు చేపట్టామన్నారు. ప్రధానంగా మండల కేంద్రాలకు, జాతీయ రహదారులకు అనుసంధానమై ఉన్న రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. వచ్చే జనవరి నాటికి రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో నేడు, రేపు ప్రత్యేక శిబిరాలు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వోలు) అందుబాటులో ఉంటారని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ ఎం.సత్యప్రభ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, శంఖవరం మండలాలలతో పాటు ఏలేశ్వరం నగర పంచాయతీలలో 227 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ పోలింగ్ కేంద్రాలల్లో రెండు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలు ఓటరు జాబితాలో పేర్లు నమోదు, మార్పులు, తొలగింపు తదితర సమస్యల పరిష్కారానికి పోలింగ్ కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా అన్నసమారాధన

కిర్లంపూడి: జగపతినగరంలో వేంచేసిన అభయ దుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దేవీ నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

12 నుంచి 'ఆదిత్య'లో చండీయాగం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి 16 వరకూ సహస్ర చండీయాగం నిర్వహించనున్నట్టు ఆ యూనివర్సిటీ చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి శుక్ర వారం తెలిపారు. ఐదు రోజులపాటు వేద పండితులతో అఖండ దీపారాధన, రుద్రాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఆసుపత్రి మూత.. వైద్యానికి వెత

- పెరుమాళ్లపురంలో తెరుచుకోని ప్రభుత్వ హోమియో ఆస్పత్రి
- ప్రజలకు అందని వైద్య సేవలు
- అధ్వానంగా ఆస్పత్రికి వెళ్లే రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు



పెరుమాళ్లపురంలో మూతపడిన ప్రభుత్వ హోమియో ఆస్పత్రి

తొండంగి: గతంలో కోనప్రాంత ప్రజలకు పెరుమాళ్లపురం హోమియో ఆసుపత్రి అపర సంజీవనిగా ఉండేది. మండలంలోని గ్రామాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రోగులు వచ్చి ఇక్కడ వైద్య సేవలు పొందేవారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రి మూత పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హోమియో వైద్యశాల నిర్వహణ నిర్లక్ష్యానికి గురవ్వడంతో పాటు వైద్యులు, సిబ్బంది కొరతతో ఆసుపత్రిలో సేవలను నిలిపివేశారు. దీంతో హోమియో మందులకు అలవాటు పడిన ప్రజలు అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలో మూడు చోట్ల...

ప్రభుత్వం ఆయుష్ విభాగం ద్వారా నియోజకవర్గంలోని కోటనందూరు మండలం అల్లిపూడి, తొండంగి మండలంలోని రావికంపాడు, పెరుమాళ్లపురం గ్రామాల్లో మొత్తం మూడు హోమియో డిస్పెన్సరీలను నిర్వహిస్తోంది. సుమారు 40 ఏళ్ల నుంచి మండలంలోని ప్రభుత్వ హోమియో వైద్యశాలను తుపాను పునరావాస భవనంలో నిర్వహించారు. అప్పట్లో వైద్యుడిగా డాక్టర్ బి.కృష్ణమోహన్ సుదీర్ఘ కాలం పాటు రోగులకు వైద్య సేవలందించారు. ఈ నేపథ్యంలో హోమియో వైద్యానికి మరింత ఆదరణ పెరిగింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల నుంచి కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్, కీళ్లవాతం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఇక్కడకు వచ్చి హోమియో వైద్య సేవలు పొందేవారు. ప్రతిరోజూ 100 నుంచి 200 వరకూ ఓపీ ఉండేది.



స్థలదాత యాదాల పెంటయ్య(ఫైల్)

రూ.15 లక్షల విలువ చేసే స్థలం విరాళం

నిత్యం వందలాది మంది రోగులు వైద్యం కోసం తుపాను పునరావాస భవనంలో అసౌకర్యాల నడుమ ఇబ్బందులు పడేవారు. వైద్యశాలకు సొంతగూడు లేదని అప్పట్లో «సాక్షి»లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించి గ్రామానికి చెందిన దాత యాదాల పెంటయ్య రూ.15 లక్షల వరకూ విలువైన రెండున్నర సెంట్ల స్థలాన్ని విరాళంగా ప్రకటించారు. దీనికి మరో సెంటు కలిపి పెంటయ్య కుమారుడు కొండబాబు కుటుంబ సభ్యులు ఆస్పత్రికి భూమిని రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేశారు. 2013లో నేషనల్ రూరల్‌హెల్త్ మిషన్ పథకంలో రూ.7.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. వాటికి మరికొన్ని నిధులు కేటాయించి ఎట్టకేలకు భవన నిర్మాణం పూర్తి చేశారు. ఈ భవనంలో కొన్నేళ్ల పాటు ప్రజలకు వైద్య సేవలు అందాయి. తదనంతరం ఆస్పత్రిలో వైద్యులు, ఇతర సిబ్బంది లేక మూతపడింది. దీంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు హోమియో వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం హోమియో ఆస్పత్రిలో డాక్టర్‌తో పాటు ఇతర సిబ్బంది నియమించి రోగులకు వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్థల దాత కుటుంబ సభ్యుల ఆవేదన

కోనప్రాంతంలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో దాత యాదాల పెంటయ్య కుటుంబ సభ్యులు హోమియో ఆస్పత్రికి స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. కాగా ప్రస్తుతం ఆసుపత్రి మూత పడటంతో దాత ఆశయం నెరవేరలేదని ఆయన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రిని పునఃప్రారంభించాలి



నా తండ్రి పెంటయ్య కోరిక మేరకు కొంత స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణం కోసం కేటాయించాం. అది సరిపోదని చెప్పడంతో మళ్లీ మరికొంత భూమిని రహదారి కోసం కేటాయించి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాం. ప్రస్తుతం ఆస్పత్రి మూతపడిపోయింది. ప్రభుత్వం ఆస్పత్రిని పునఃప్రారంభించాలి.

–యాదాల కొండబాబు, స్థలదాత పెంటయ్య కుమారుడు, పెరుమాళ్లపురం

మెరుగైన వైద్య సేవలు అందేవి



పెరుమాళ్లపురంలో హోమియో ఆస్పత్రి తుపాను భవనంలో ఉండేది. అప్పటి నుంచి మేము హోమియో ఆస్పత్రిలో వైద్యం పొంది మందులు వాడేవాళ్లం. కొంతకాలంగా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది లేక మూడపడింది. ప్రభుత్వం హోమియో వైద్యుడిని, సిబ్బంది నియమించి వైద్య సేవలందేలా చూడాలి.

–ఎదురుపాక చంద్ర, గ్రామస్తురాలు, పెరుమాళ్లపురం

మళ్లీ ప్రారంభిస్తే ప్రజలకు మేలు



హోమియో ఆస్పత్రికి వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం ఆస్పత్రి నిర్వహించడం లేదు. మళ్లీ వైద్యసేవలు ప్రారంభిస్తే తీరప్రాంత గ్రామాల ప్రజలు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

–కోడా లోవ, గ్రామస్తురాలు, పెరుమాళ్లపురం

కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కేఎల్ యూనివర్సిటీ ప్రతినిధి

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ(ఏఐ)పై రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాపును గురువారం ప్రారంభించారు. విజయవాడ కేఎల్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ చుండూరు మాధవరావు, అసోసియేట్ ప్రొఫెసర్ వై.శివ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి కృత్రిమ మేధస్సుపై అవగాహన పెంచుకోవాలన్నారు. కంప్యూటర్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్‌లో ఏఐ ఆధారిత పరిశ్రమల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఏఐ ద్వారా విశ్లేషణాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ



కిర్లంపూడి ఉమావైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ

కిర్లంపూడి: స్థానిక ఉమావైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధానార్చకులు బాధంపూడి సూర్యనారాయణ మూర్తి, బాధంపూడి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ, పార్వతీదేవీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గండేపల్లి: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మల్లేపల్లి, గండేపల్లి, తదితర గ్రామాల్లో తెల్లవారుజామున నగర సంకీర్తనలు నిర్వహిస్తున్నారు. నీలాద్రిరావుపేట, ఉప్పలపాడు గ్రామాల్లో ఆలయాల్లో ఏకాహాలు నిర్వహిస్తున్నారు. పలువురు భక్తులు సత్యదీక్షలు, శివ మాల, అయ్యప్ప మాలలు ధరించడంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రత్తిపాడు: స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థిని అదృశ్యమైన ఘటనకు సంబంధించి కళాశాల యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (విజృంభణ) నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ రోడ్డులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ అదృశ్యమైన విద్యార్థిని తల్లిదండ్రులు ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పోలీసులు కళాశాల యాజమాన్యానికి సహకరిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థినులు, మహిళలపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కళాశాల యాజమాన్యంపైనా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

'హలో మాల–చలో కాకినాడ' కరపత్రం ఆవిష్కరణ

జగ్గంపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కాకినాడలో ఈ నెల 18న నిర్వహించే హలోమాల–చలో కాకినాడ బహిరంగ సభకు మాలలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాల జేఏసీ జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ మురారి రవికుమార్ పిలుపునిచ్చారు. జగ్గంపేట వాసుదేవ నగర్ బుద్ధుని పార్కులో శుక్రవారం మాలల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హలోమాల–చలో కాకినాడ కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో జేఏసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పులి ప్రసాద్, బహుజన్ సమాజ్‌పార్టీ జుత్తుక నాగేశ్వరరావు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి సాదే నరేంద్రబాబు తదతరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తొండంగిలో తహసీల్దార్ మురార్జీకి వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది



కిర్లంపూడిలో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

తొండంగి: ప్రభుత్వం తక్షణమే తమకు పెండింగ్ జీతాలను చెల్లించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని 104 సిబ్బంది కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ బి.మురార్జీ, ఎంపీడీఓ రాజేశ్వరరావులకు వినతి పత్రాలు సమర్పించారు. మూడు నెలలుగా తమకు జీతాలివ్వకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. 104 వాహన నిర్వహణ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, ఇన్సూరెన్స్ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో 104 సిబ్బంది యూనియన్ తుని డివిజన్ నాయకులు ఆర్.హరిప్రసాద్, డీఈఓ సుధీర్, రమేష్, పి.అభిషేక్, ఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: గత 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలని 104 సిబ్బంది కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ బి.హరికృష్ణకు, డిటీ సాయికిరణ్‌కు శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరబిందో ఫార్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 104 సిబ్బంది విధులు నిర్వహించే వారని, ప్రస్తుత ప్రభుత్వం అరబిందో సంస్థ నుంచి 104ను తప్పించడంతో గత మూడు నెలల నుంచి జీతాలు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు చెల్లించాలని, లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలివేల చిట్టిబాబు, డీఈఓ కండిపల్లి శివశంకర్, వీరేంద్ర, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో యువకుడి అరెస్టు



ప్రత్తిపాడు పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయి

ప్రత్తిపాడు: మండలంలోని రాచపల్లి గ్రామ శివారులో గంజాయి తరలిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. వివరాల్లోకి వెళితే...పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు పర్యవేక్షణలో శుక్రవారం స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తన బృందంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గంజాయికి బానిసైన నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన కోలా మణికంఠ అలియాస్ మణిదీప్ గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబట్టాడు. అతనిని సోదా చేయగా 21 కేజీల గంజాయి పట్టుబడింది. మత్తుకు బానిసైన మణికంఠ గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ, ఎక్కువ డబ్బులకు విక్రయించేవాడు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా, పసుపులంక అటవీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు.

రీసర్వే గ్రామ సభలకు 544 దరఖాస్తులు



పి.ఇ.చిన్నాయపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

తొండంగి: మండల పరిధిలోని గ్రామాల్లో భూముల రీసర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈ సభల ద్వారా ఇప్పటివరకూ రైతుల నుంచి 544 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ మురార్జీ తెలిపారు. శుక్రవారం పి.ఇ.చిన్నాయపాలెంలో గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి గ్రామంలోని రైతుల నుంచి 41 దరఖాస్తులు వచ్చాయన్నారు. కాగా ఇప్పటి వరకూ ఆనూరు, పైడికొండ, వేమవరం, పి.అగ్రహారం, శృంగవృక్షం, గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, రావికంపాడు, కొమ్మనాపల్లి, పి.ఇ.చిన్నాయపాలెం మొత్తం కలిపి 544 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన, మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 25 మంది భక్తులు రూ.750 టికెట్టుతో ఈ హోమంలో పాల్గొన్నారు. వేద పండితులు వేదుల ఘనపాఠి, ఉపాధ్యాయుల రమేష్, కోట వంశీ, కూచుమంచి ప్రసాద్, చెళ్లపిళ్ల ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన, కొండ దిగువన తొలి పావంచా వద్ద కనకదుర్గ అమ్మవారికి చిట్టెం గోపి ఆధ్వర్యాన రుత్విక్కులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులే లక్ష్యం



పంటకోత ప్రయోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అమృత

కిర్లంపూడి: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు మండల వ్యవసాయశాఖ అధికారి జోకా అమృత తెలిపారు. మండలంలోని ముక్కొల్లులో శుక్రవారం వరి పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులుగా ఘనజీవామృతం, జీవామృతం, తుటాకు కషాయం, పంచగవ్వ, అజోల్లా వంటి సేంద్రియ పద్ధతిలో పండించిన సాధన సన్న రకం పొలంలో 77/75 కేజీల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. రసాయన ఎరువులు వాడిన పొలాల్లో దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఆకుల సురేష్, వీఏఏ హరికృష్ణ, శ్రీను, వెంకటేష్, శివ, శ్రీనివాస్, అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళులు



అమరవీరుడు చంద్రపుల్లారెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నేతలు

జగ్గంపేట: వికసిత్ భారత్ అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గొప్పలు చెబుతున్నా ఆకలి సూచిలో మాత్రం భారత్ 105వ స్థానంలో ఉందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయుకుడు వి.చిట్టిబాబు అన్నారు. స్థానిక స్టాలిన్ భవన్‌లో శుక్రవారం అమరవీరులు వర్ధంతి సభ నిర్వహించారు. అమరవీరుడు చంద్రపుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకురాలు లక్ష్మి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, రామిరెడ్డి, శ్రీనివాస్, వరదరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కత్తిపూడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సూర్యఅప్పారావ

శంఖవరం: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు సూచించారు. మండలంలోని కత్తిపూడి సీతారామా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ అప్పారావు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



ప్రదర్శన ఇస్తున్న చిన్నారి

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంగం యువజన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఫ్యాన్సీడ్రెస్ పోటీలు నిర్వహించారు. పట్టణంలో వివిధ పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి ఎనిమిదో తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. ఈ పోటీలకు డాక్టర్ శ్రావణి, డాక్టర్ అరుణ, పూర్ణ, శ్యామల, రామలక్ష్మి జడ్జీలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై విస్తృతంగా దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని గోకవరం గిరిజన గ్రామంలో సారా స్థావరాలపై శుక్రవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ఏలేశ్వరం మండలం సిరిపురంలో కాకినాడ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి, 20 లీటర్ల సారాతో కోట వెంకన్నను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలంలోని మెట్టుచింత గిరిజన తండాలో సారా స్థావరాలపై దాడులు చేసిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



జనార్దనరావు

తుని: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..శ్రీకాకులం జిల్లా ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామానికి చెందిన అల్లు జనార్దనరావు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంటుగా పని చేస్తున్నాడు. ఆయన విధులకు హాజరు కాకపోవడంతో మీ అబ్బాయి ఉద్యోగానికి రాలేదు, ఇంటికి వచ్చాడా? అని సంస్థ ప్రతినిధి జనార్దనరావు తండ్రి అప్పారావుకు ఫోన్ చేశారు. దీంతో అప్పారావు పాయకరావుపేట వచ్చి విషయం తెలుసుకొని రైల్వేస్టేషన్‌లో అదృశ్యమై ఉంటాడని భావించి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.